

# ఎన్.టి.ఆర్ పురాణ పాత్రలు

– డా. నందమూరి లక్ష్మీపార్వతి



డా.లక్ష్మీపార్వతిగారు డాక్టరేట్ కోసం సమర్పించిన సిద్ధాంతగ్రంథం **'ఎన్.టి. ఆర్ పురాణపాత్రలు - భారతీయ పురాణ సంప్రదాయం చలనచిత్ర శైలీకరణ'** నుంచి ఎంపిక చేయబడిన కొన్ని భాగాలు - కౌముది పాఠకులకోసం ప్రత్యేకం..!!

(గత సంచిక తరువాయి)

## ప్రత్యేక ఇంటర్వ్యూలు

(**డా.ఎన్.టి.ఆర్ గారితో** సాన్నిహిత్యం కలిగి, వారితోపాటు చిత్రరంగంలో కృషి చేసిన ప్రముఖులతో ముఖాముఖీలు ఈ పరిశోధనా కార్యక్రమంలోని క్షేత్రపర్యటన సందర్భంగా ముఖాముఖీలు ఈ పరిశోధనా కార్యక్రమంలోని క్షేత్రపర్యటన సందర్భంగా సేకరించినవి)

### ***ఆచార్య సి.నారాయణరెడ్డి***

"మన వాఙ్మయాన్ని మూడు విధాలుగా విభజించారు (1) ప్రభు సమ్మితం, (2) సుహృత్ సమ్మితం, (3) కాంతా సమ్మితం. సమ్మితం అంటే తుల్యం అని అర్థం. ప్రభువువలె శాసించేది వేదం. మిత్రుడివలె సూచన చేసేది పురాణం. కాంతాసమ్మితం - ప్రేయసిలాగా భార్యలాగా ప్రత్యక్షంగా కాకుండా హితంగా ఉపదేశించేది. ప్రత్యక్షంగా సూటిగా కాక ధ్వన్యాత్మకంగా శాసించేది.

వేదం ప్రభువులాగా కఠినంగా శాసిస్తుంది. 'సత్యంవద ధర్మంచర' ఆ సత్య ధర్మాలనే ఒక ఇతివృత్తంగా తీసుకుని మిత్రుడెలాగ సలహా ఇస్తాడో అలా చెబుతుంది పురాణం. పురాణం కథతో కూడుకున్న ఉపదేశం. కథ చెబుతూ దానిలోని సందేశాన్ని మిత్రుడిలాగా చెప్పేది. ఒక మిత్రుడు సలహా ఇస్తాడు. పురాణ వాఙ్మయం కూడా మనకు సలహా ఇస్తుంది.

ఇక మూడవది భార్యలాగా ధ్వని లాస్యంగా చెబుతుంది. లాస్యం చేసేది వాచ్యంకాదు. ఆలస్యంగా వచ్చే భర్తను చూసి భార్య 'ఇంత తొందరగా ఎందుకు వచ్చారండి. ఈ రాత్రి రాకున్నా ఫర్వాలేదు' అని వ్యంగ్యంగా చెప్పినట్లు.

కాంతాసమ్మితం కావ్యం. ప్రత్యక్షంగా విప్పిచెప్పకుండా ధ్వని అర్థంలో వాళ్ళకర్థమయ్యేటట్టు వ్యంగ్యంగా చెప్పినట్లు.

కాంతాసమ్మితం కావ్యం. ప్రత్యక్షంగా విప్పిచెప్పకుండా ధ్వని అర్థంలో వాళ్ళకర్థమయ్యేటట్టు వ్యంగ్యంగా చెప్పటం దీని ప్రయోజనం.

మీరు పురాణ వాఙ్మయాలకు సంబంధించిన ఇతివృత్తం తీసుకుని - అందులో నందమూరి తారకరామారావుగారు నటించిన- జీవించిన - పురాణపాత్రలను తీసుకుని వారి శైలీ శిల్పం గురించి పరిశోధన చేస్తున్నారు. ఇంతవరకు ఈ విషయం అచుంబితం. ఎవరూ ముట్టనిది. ఎవరూ చేపట్టనిది. ఈ విషయం తీసుకున్నందుకు ముందుగా మిమ్మల్ని అభినందిస్తూ సినిమాలకొస్తాను.

సినిమా, జీవిత చిత్రణమే. నాటకం చేసిన పని సినిమా చేస్తున్నది. నాటకాల్లో నుంచి క్రమపరిణామం చలనచిత్రం. క్రమ పరిణామంలో నాటకం చావలేదు. అది ఒక ప్రత్యేక ప్రక్రియగానే కొనసాగుతూనే సినిమాకు జన్మనిచ్చింది. యక్షగానం బ్రతికే ఉంది. నాటకం బ్రతికే ఉంది. కొత్త ప్రక్రియ వస్తే పాతది నశిస్తుందనుకోవటం సత్యసమ్మతం కాదు. ఇది ఆధునిక వచన కవితా యుగం. మోస్ట్ మోడ్రన్ పొయిట్రీ అత్యాధునిక వచన కవితా యుగం కూడా, ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ, భారతీయ భాషల్లోనూ అంతే. అంతమాత్రం చేత (తెలుగు) పద్యం చావదు. పద్య రచయితలు సంఖ్య తక్కువ కావచ్చు. కానీ పద్యం చావలేదు. వచనం చావలేదు. ఇక తెలుగు చలనచిత్ర రంగ ప్రవేశం ప్రారంభదశనుండి అటు సాంఘికేతివృత్తాలతో ఇటు పౌరాణిక వృత్తాలతో చిత్రాలు నిర్మించింది. జానపదేతివృత్తాలు కూడా నిర్మించింది. పురాణాలు సాంఘికాలు, కాల్పనిక కథలు కాదు జానపదాలు. ఫిక్షన్ అన్నమాట. ఫిక్షన్ అంటే కాల్పనికం, అనుచానంగా మన పెద్దలు, తాతముత్తాతల కాలం నుండి చెబుతున్న కథలు. అలాగే పురాణ గాథల్ని తీసుకుని చిత్రాలు నిర్మించారు. 'పురా నవం పురాణం' పాతదే కొత్తగా కనిపిస్తుంది. రామాయణం పురాణం, కావ్యం, రామాయణాన్ని నిత్యజీవితంలో చూస్తున్నాం. భారతం, అంతా నడుస్తున్న రాజకీయమే. అందులో ఉన్న వైరుధ్యం, మార్మికం, విధ్వంసం అన్నీ ఇందులో ఉన్నాయి. వేదంలో కథలున్నాయి. పురాణాల కథలన్నీ. రామాయణేతివృత్తాలు, భారతేతి వృత్తాలు అన్నిటినీ ఇలాగే సినిమాలుగా నిర్మించారు మనవాళ్ళు.

నందమూరి వారి పాత్రల గురించి ఇప్పుడు ప్రధాన వివక్ష. వారి తొలి అడుగు సాంఘిక చిత్రంతోనే ప్రారంభమైంది. నాటకాల్లో వేశారు. అసలు నటుడిగా పైకి రావాలని వారికి లేదు. నాకు తెలిసినంతవరకు కుటుంబ బాధ్యతలు దృష్టిలో పెట్టుకుని చితికిపోయిన కుటుంబాన్ని మళ్ళీ అతుకుపెట్టి పైకి తీసుకురావాలనే నిబద్ధత ఉన్నవారు. మళ్ళీ యధాతథంగా కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే తపనతోనే సినీరంగంలోకి వచ్చారు తప్ప, నటించాలని లోపల ఉందేమోకాని, దానికోసం అందరిలాగా వెంపర్లాడలేదు. చాలా చిన్నవేషం. అయినా ఒప్పుకున్నాడు. షావుకారులో మహోదాత్తంగా నటించాడు అప్పుడప్పుడు సాంఘిక చిత్రాల్లో తన పరిధి మీరుతున్నాడు ఎన్టీఆర్ అనే వాదం లేకపోలేదు. అది తెలియక చేసింది కాదు జనాకర్షణ కోసం. బడిపంతులు, ఎంతబాగా పోషించారో! ఎంత పరిణతిగల నటన శ్రీకృష్ణదేవరాయలులో.

పౌరాణిక సినిమాలకొస్తే సాంప్రదాయికంగా అంతకుముందున్న నటులు రఘురామయ్యలాంటివారు కృష్ణుడు పాత్రవేశారు. కానీ ఎన్టీఆర్ గారి నాటికి అవే కృష్ణ, రామ పాత్రలకు స్వరూపం మార్చారు. లక్షణ శాస్త్రం ప్రకారం చూస్తే శ్రీకృష్ణపాత్ర ధీరలలిత. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడైన ధీరోదాత్తుడు. దుర్యోధనుడు ధీరోద్ధతుడు. ధీరోద్ధత నాయకత్వంలో గాంభీర్యం, ఔదార్యం వీటిని మించిన అహంకారం కూడా ఉంటుంది. రామారావుగారు రాముడిపాత్ర నటిస్తే గంభీరంగా, శాంతంగా ఉంటుంది. ఎప్పుడో కానీ కనుబొమలు పైకెత్తిని ఉదాత్తతను పాటించారు. శ్రీకృష్ణపాత్రకు వస్తే అన్నీ కదలికలే. చిరునవ్వులో కదలికలున్నాయి. ఒకసారి నేనన్నాను. "రామారావుగారూ! శ్రీకృష్ణపాత్ర మీద ఒక కామెంట్ చెబుతాను. ఆ పాత్ర పట్ల జనానికెందుకంత ఆకర్షణ అంటే ఆ నడకలో కలికితనం, అంటే స్త్రీత్వం ఉంటుంది", అని నడిచి చూపించాను. నేనూ యాక్టర్నే. కనుక బాగా నవ్వి, 'కరెక్ట్ ఆ వెరైటీ అందుకే వచ్చింది' అని నవ్వారు. నడక మామూలుగానే ఉంటుంది. కానీ రామారావుగారి నడకలో ఒక కలికితనాన్ని ప్రవేశపెట్టి జనాకర్షణకు హేతుభూతమైన పాత్రను

తీర్చిదిద్దారు. రాయబారం ఘట్టంలో మళ్ళీ వీరుడిగా కనిపిస్తాడు. ఇది నాయక పాత్ర. రామాయణ భారతాల్లో పాత్రలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. దుర్యోధన శబ్దాన్ని ఆయన ఒప్పుకోలేదు. "సుయోధన" అనమనేవారు. "స్వాగతం సుయోధన" అని పాట వ్రాయించారు. "అభిమాన ధనా, సుయోధనా!" అని వ్రాసారు.

అలా ఈ రెండు పాత్రలు ప్రతి నాయకపాత్రలు రావణాసురుడు, దుర్యోధనుడు. రావణుడంటే సీతాపహరణం వలన విలనయ్యాడు. అదొక్కటి తప్పు, అతనిలో అన్నీ మంచి లక్షణాలే. రామారావుగారి విలక్షత ఏమిటంటే ఆ పాత్రలో కూడా ఎవరూ స్పృశించని కోణాలు, పార్శ్వాలు నటించాలి. ఏదో ఒక కొత్తదనం చూపించాలి. ఆయన పరిణతి చెందుతున్న దశలో తనకు కావలసిన నిర్మాత దర్శకులతో చర్చించేవారు. రాను రాను ఆయనే పాత్ర చెప్పారు. తరువాత తానే పాత్రకు రూపకల్పన తెచ్చారు. దక్షిణాదిలో ద్రావిడోద్యమం ప్రారంభమయ్యాక ఈ రావణాసురుడు దాక్షిణాత్యుడని ఆర్యులకు వ్యతిరేకంగా అతన్ని దుష్టపాత్రగా చిత్రీకరించారని లంకేశ్వరుడైన రావణుడు కథానాయకుడని రూపకల్పన చేసేవారు. మనం అనుకున్నట్టు దుష్టపాత్రలనుకున్నవి దుష్టపాత్రలు కావని, ఆత్మాభిమానం వున్న పాత్రలని, వ్యక్తిత్వం వున్న పాత్రలని దక్షిణాదిలో ద్రావిడోద్యమంలో ఉబికిన కొన్ని సిద్ధాంతాలు. రామారావుగారు మద్రాసులో ఉండడం వలన వారితో కొంత పరిచయం ఉండడం వలన ఆ ప్రభావం పడింది. ఇటువైపు పురాణ పాత్రలు చదివి ఆకళించుకున్న విజ్ఞానం, సముద్రాల పింగళిగారితో చర్చించి తీసుకున్న నిర్ణయాలు, దీంతోపాటు ద్రావిడ భాషోద్యమకారుడిచ్చిన విలక్షణమైన రూపరేఖలు రెండూ సమన్వయం చేసుకున్నారు. సీతారామకళ్యాణం, భూకైలాస్‌లలో రావణపాత్ర అలా రూపొందించి ధరించారు. రెండోది దుర్యోధన పాత్ర. శ్రీకృష్ణ పాండవీయం, దానవీరశూరకర్ణలో ధరించారు. రామ-కృష్ణ భక్తి విధానంలో ఆయన పరమ సంప్రదాయ విధాయి. కానీ పాత్రల విషయం వచ్చేసరికి ఆ రెండు పాత్రలకు అన్యాయం జరిగిందనే ఉద్దేశ్యంతో వారు అలా రూపకల్పన చేశారు. బైబిల్లోని సైతాన్ పాత్రను తీసుకుని ఎవరయినా ఇంగ్లీషువాడ్ని సినిమా తీయమనండి. రామారావుగారయితే మెప్పించే వారేమో, సైతాన్ వల్లనే కదా, సృష్టి ఏర్పడిందని ఒప్పించేవారు.

మిల్టన్ 'ద పారడైజ్ లాస్ట్' మానవులు స్వర్గచ్యుతులవటం చెబుతుంది. 'నేను క్రింద పడతాను. కాని త్రిముఖంగా పెరిగి నీదాకా వస్తాను' అని శపథం చేస్తాడు మనిషి. దాని ఫలితమే చంద్రమండలం దాకా ఎగరటం. కళాత్మకంగా ఎన్నో నిర్మించారు. ఆధ్యాత్మికంగా ఎంతో ఎదిగారు. ఒకే చిత్రంలో సుయోధనుడు, కృష్ణుడు, కర్ణుడు; రాముడు రావణుడు ఇలా భిన్నంగా వేయటం అనితర సాధ్యం. 'టెన్ కమాండ్‌మెంట్స్' హీరోని విలన్‌గా వేయమనండి. సాధ్యంకాదు. పౌరాణిక పాత్ర వేయాలంటే ఆ మూర్తి వేరు. ఆ విగ్రహం వేరు. ఏ పాత్రకయినా మలచుకోగలిగిన దేహ సౌందర్యం. ధీరలలితుడు, ధీరోద్ధతుడు మూడు కర్ణ పిక్చర్‌లో వైవిధ్యంగా నటించారు. ఇక శైలి, శిల్పం: ఇవన్నీ శైలిలో వస్తాయి. డైలాగ్ డెలివరీ మృదువుగా ఉంటుంది. కృష్ణుడికి మంద్రంగా, కాదంటే మధ్యంగా ఉంటుంది. కర్ణుడికి ఉద్ధతంగా ఉధృతంగా ఉంటుంది. దుర్యోధనుడికి సంభాషణలు కూడా అలా వ్రాయిస్తారు. సమాసభరితంగా రచనా శిల్పం తొణికిసలాడేలాగా! పొడిపొడి మాటల్లో కృష్ణుడికి వ్రాయిస్తారు. "సత్యా! కోపమా! లేక తాపమా!" అంటూ అది శృంగారం. మనం అనుకున్న పాండవులు కాదు ఆయన చూసింది. సుయోధనుడి పాత్రద్వారా వీళ్ళెక్కడి వాళ్ళు అని ప్రశ్నించాడు. దానికనుగుణంగా డైలాగులు వ్రాయించుకున్నారు. కిరీటాలు, ఆ ఆభరణాలు తానే స్వయంగా కాగితం మీద డిజైన్ చేసి తయారు చేయించేవారు. డైలాగ్స్ కూడా ముందు తనే వ్రాసుకునేవారు. తనకు సంబంధించి కథ తనదే. సంభాషణలు ఆయన మనసులోనివే. పాటలు కూడా ఆయన ఊహలకనుగుణంగా ఉంటేనే ఒప్పుకునేవారు. కాబట్టి తనేకథ, డైలాగ్స్ వ్రాసుకునేవారు. ఇప్పుడు స్క్రీన్‌ప్లే అంటామే. స్క్రీన్‌ప్లేకు డైలాగ్స్‌కు తేడా ఏమిటంటే స్క్రీన్‌ప్లేలో డైలాగ్స్‌తోపాటు ఆయా పాత్రలు చేసే అభినయం ఉంటుంది. అదికూడా బ్రాకెట్‌లో వ్రాయాలి. సన్నివేశాలు మార్పు ఉంటుంది. ఆయా కాలగతి నిరూపణం ఉంటుంది. దీన్ని స్క్రీన్‌ప్లే అంటారు. కాబట్టి మామూలు కథకు, చిత్రకథకు తేడా ఏమిటంటే డైలాగ్‌కూ డైలాగ్‌కూ మధ్య యాక్షనుంటుంది. అది బ్రాకెట్‌లో వ్రాసుకుని 'ఇతడు డైలాగ్ అనగానే ముందుకొచ్చి

చిరునవ్వుతో చేయిసాచి వెనక్కు వెళ్ళిపోవాలి' అని వ్రాయాలి. ఆ విధంగా అద్భుతంగా రామ - రావణ పాత్రలను ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా ప్రతినాయక పాత్రలను నాయక పాత్రల తుల్యంగా చేసిన వైశిష్ట్యం ఒక్క ఎన్.టి.ఆర్ దే వేలాది సంవత్సరాలుగా దుష్టపాత్రలని పేరుబడ్డ వాటినలా ఎందుకు విమర్శిస్తున్నాం? మీరు శిష్టపాత్రలనుకున్న వాళ్ళ లోపాలేమిటి? వాటిని పరిశీలించరేం అనే దృష్టితో వాటిని తీర్చిదిద్దారు.

అలాగే కర్ణుడు మాటలు తక్కువ సమాసాలతో సహజంగా ఉంటాయి. సత్యహరిశ్చంద్రలో పరమశాంతం. అది ఎన్.టి.ఆర్.గారి శైలికి పూర్తిభిన్నమైంది. దుష్యంతుడు శృంగారం. వృద్ధుడైన భీష్మపాత్ర. వైవిధ్యం కూడా సహజత్వానికి పరమ సన్నిహితంగా ఉంటుంది. గొంతు తరుణదశకు, ప్రౌఢదశకు, వృద్ధాప్యదశకు సరిపోతుంది. అలా మాడ్యులేట్ చేసుకుంటారు. మరొకరికి అలా సాధ్యం కాదు. భావాలకు గాని, స్వరాలకు గాని, పదాలకు గాని నడకగాని అద్భుతమైన వైవిధ్యాన్ని ప్రదర్శించారు. పురాణపాత్రల్లో ఏ పాత్రకు ఏ శైలి (స్టైల్) అనీ ఆలోచించి ప్రవేశపెట్టారు. మధ్య మధ్య గాప్స్ ఇవ్వటం, మంద్రం, మధ్యం తారాస్థాయిలో ఉంది. సందర్భాన్నిబట్టి పలకటం, శిల్పం అంటే సంవిధానం, ఒక అస్తిత్వం. స్టైల్ - శైలి అంటే మొత్తం మనిషి అని అర్థం. శిల్పమనేది కుదురుగ ఉండే అస్థిత్వ విధానం. మూర్తిమత్వం ఎన్టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాలన్నీ చలనచిత్ర రూపంలో వున్న కావ్యాలు, ప్రబంధాలు. భావితరాలకు ఆయన పాత్రల క్లిప్పింగ్స్‌కు వ్యాఖ్యానం జోడించిపెడితే గొప్ప శిల్పపాఠాలు.

విశిష్ట శిల్పాన్ని కూర్చి ప్రపంచంలోనే పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక చలన చిత్రాల్లో ఏ నటుడు అభినయించని పాత్రలన్నీ వైవిధ్యంతో విశిష్టత చూపి నటించిన మహానటుడు, ఆత్మీయనటుడు శ్రీ నందమూరిగారు. దుర్యోధనుడికి డ్యూయట్ వ్రాయటం అదొక అపురూప ప్రయోగం, అటువంటి మహానటుడు గురించి సిద్ధాంతవ్యాసం సమగ్రంగా రావాలని కాంక్షిస్తున్నాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments